ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు
జిల్లా వార్తలు

గురువారం 14 మార్చి 2024



సన్నద్ధతపై చూపని శ్రద్ధ

పది పరీక్షలు

నామమాత్రంగానే ఏర్పాట్లు

గాలికొదిలేశారా?

చిత్తూరు (సెంట్రల్), మార్చి 13: ఎన్నికల ఏడాది ఓట్లగోల తప్ప జగన్ ప్రభుత్వానికి మరొకటేదీ పట్టినట్టు లేదు. ఈ నెల 18 నుంచి మొదలు కానున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో మునుపటి శ్రద్ధ పెట్టలేదు. ఈ ఏడాది జిల్లాలో 22,594 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు.ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 21199 మంది కాగా, ప్రైవేటు విద్యార్థులు 1395 మంది ఉన్నారు. 166 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. ఈ తీరు పది పరీక్షల ఫలితాల మీద ప్రభావం చూపుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

- ప్రత్యేక తరగతులు నామమాత్రంగా నిర్వహించారు.
- ప్రీఫైనల్ పరీక్షల తర్వాత టెస్ట్ విద్యార్థులను అసలు పట్టించుకోలేదు.
- గతంలో రాత్రి సమయాల్లో ఇంటింటికీ పర్యవేక్షించేవారు. ఈ ఏడాది అలాంటి చొరవ తీసుకోలేదు.
- డివిజన్ స్థాయిలో విషయ నిపుణులచే విద్యార్థుల్లో చైతన్యం నింపే సమావేశాలు ఒక్కటి కూడా నిర్వహించలేక పోయారు.
- సబ్జెక్టు నిపుణులచే తయారు చేయించే ప్రత్యేక బుక్‌లెట్‌పై దృష్టి సారించలేదు.
- పరీక్షలు దగ్గరపడినా పరీక్ష కేంద్రాల ఏర్పాట్లు పూర్తి కాలేదు. ఈ కేంద్రాల్లో డెస్కులు, ఫ్యాన్లు, బయట టాయిలెట్స్ ఉన్నాయా? లేవా? అనే వాటిపై ఇప్పటి వరకు విద్యాశాఖ అధికారులు దృష్టి సారించలేదు.
- ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై కూడా నిర్ణయం తీసుకోలేదు.

పథకాల పేరుతో పచ్చి అబద్ధాలు

కల్లూరు, మార్చి 13: ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం నుంచి మీరు పొందిన పథకాల లబ్ధి ఇదీ.. అంటూ రంగురంగుల కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ పంచుతున్నారు వైసీపీ వలంటీర్లు. రూపాయల్లో లెక్కలు కట్టి మీ ఇంటికి ఇన్ని లక్షలు ఇచ్చాం అని చెబుతున్నారు. సీఎం జగన్ సంతకంతో ఉన్న ఈ కరపత్రాల్లో అబద్ధాలు అచ్చేసి మరీ పంచుతున్నారని పులిచెర్ల మండలంలో కొందరు లబోదిబోమంటున్నారు. ఇంతేసి డబ్బు మాకెక్కడ ఇచ్చారు? అని ప్రశ్నిస్తున్నారు.ఇంటిస్థలాల భూసేకరణకు, భూమి అభివృద్ధికి రూ. 2.48 కోట్లు చెల్లించినట్లుగా సచివాలయంలో బోర్డులో రాసిన లెక్క ల్లో ఎన్ని లొసుగులున్నాయో అని అనుమానిస్తున్నారు. ఈ అబద్ధాల ప్రచారంపై బుధవారం ప్రజలతో కలిసి టీడీపీ నాయకులు సచివాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. కరపత్రాల్లో రాసినట్టు నిజంగానే వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వండి అని టీడీపీ నాయకులు మోహన్ దాస్, బాబు, పూల రమేష్ డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో నూర్‌బాషా, వెంకటేష్, శ్రీను, త్యాగరాజ్, మునికృష్ణ పాల్గొన్నారు.



ఆ భూమి ఎక్కడుందో చూపండి

నా భార్యకి రూ.రెండు లక్షలు చేసే పట్టా ఇచ్చామని అచ్చేశారు కదా.. ఆ భూమి ఎక్కడుందో చూపించండి. భూమి లేని మాకు రైతు భరోసా ఇచ్చామని అబద్ధాలు చెబుతున్నారు. మా పేర్లతో ఆ డబ్బులు ఎవరు తిన్నారు?

- వెంకటేష్, దేవి భర్త



మరీ ఇన్ని పచ్చి అబద్ధాలా?

మా నాన్నకు రైతు భరోసా ఎప్పుడు ఇచ్చారు? ఆ డబ్బు ఎవరు తిన్నారు? ఇంటి స్థలం కూడా ఇచ్చామని రాసేశారు. ఎక్కడ ఇచ్చారు? మరీ ఇంత పచ్చి అబద్ధాలా?

- సుందరరాజ్, సుధాకర్ కుమారుడు

దీనికేం చెబుతారు?

- పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి సచివాలయం పరిధిలోని ఆర్.కుమ్మరపల్లికి చెందిన ఎం.దేవికి ఇంటి స్థలం ఇవ్వకున్నా ఇచ్చినట్లు పేర్కొన్నారు. అందుకుగానూ ఆమె రూ.2 లక్షలు లబ్ధిపొందినట్లు కరపత్రంలో ఉంది. అంతేకాదు సెంటు భూమి లేని ఆమెకు వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రూ.13500 అందినట్లు కరపత్రంలో అచ్చేశారు.
- ఐదెకరాలకుపైగా భూమి ఉన్నందున ఆర్.కుమ్మరపల్లికి చెందిన ఎం.సుధాకర్‌ను రైతు భరోసా నగదుకు అనర్హుడిగా గుర్తించారు. అయినా రైతు భరోసా నగదు రూ.61 వేలు ఆయనకు అందినట్లు కరపత్రంలో అబద్ధాలు అచ్చేశారు.



వెంకటదాసరపల్లి సచివాలయం ముందు నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

- వార్డు సచివాలయంలో చీరల గుట్టలు
- వలంటీర్ల ద్వారా మహిళా ఓటర్లకు పంపిణీ
- పుంగనూరులో పబ్లిక్‌గా ఎన్నికల తాయిలాలు
- కళ్లు మూసుకున్న పోలీసులు, అధికారులు

వైసీపీ నేతల బరితెగింపు!

ఓటర్లను మభ్యపెట్టడానికి గోడ గడియారాలు తెచ్చి నిల్వ ఉంచారంటూ పోలీసులు సెర్చ్ వారెంటుతో సోదాలు చేశారు. పుంగనూరు పట్టణంలో, చదళ్ల సమీపం తిమ్మికృష్ణాపురంలో భారీగా గడియారాలు సీజ్ చేశారు. వీటి మధ్యలో కర్ణాటక మద్యం ఉందంటూ కేసులు పెట్టారు. తమ కార్యకర్తలకోసం గడియారాలు తెప్పించామని బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ చెప్పినా పట్టించుకోలేదు.

మరిప్పుడు, వార్డు సచివాలయంలోనే చీరలు ఉంచారు. వలంటీర్లు వచ్చి ఆటోల్లో వీటిని తీసుకెళ్లారు. పుంగనూరు పట్టణంలోని తమ పరిధిలో ఇంటింటికి చీరలు పంపిణీ చేశారు. ఇదంతా పట్టపగలు.. పబ్లిక్‌గా జరిగింది. 16వ వార్డు సచివాలయానికి సంబంధించి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయినా, 'నో పోలీస్'.



1: సచివాలయం వద్ద ఆటోలో ఉంచిన చీరలు

2: పుంగనూరులోని 16వ వార్డు సచివాలయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న చీరలు

3: సచివాలయ ఆవరణలో పంపిణీ కోసం సిద్ధంగా ఉంచిన చీరలు



చీరలు తీసుకెళ్లడానికి వార్డు సచివాలయంలో ఉన్న వలంటీర్లు

- ఓటర్లను మభ్యపెడితే సహించేది లేదని, చర్యలు చేపడతామంటూ ఫిబ్రవరి 6వ తేదీన గోడగడియారాలు సీజ్ చేసిన పోలీసులు.. బుధవారానికి వచ్చే సరికి సైలెంట్ అయిపోయారు. ఎందుకంటే.. ఆ గడియారాలు బీసీవైపార్టీవి. ఇప్పుడు చీరలు పంచింది అధికార పార్టీ. పోలీసుల దృష్టిలో 'బోత్ ఆర్ నాట్ సేమ్' మరి.

అది పుంగనూరు పట్టణం కొత్తపేటలోని 16వ వార్డు సచివాలయం. కార్యాలయంలోపల చీరల గుట్టలున్నాయి. దీనిని బట్టల షాపుగా మార్చేశారు. బుధవారం ఒక్కొక్కరుగా వలంటీర్లు అక్కడికి వస్తున్నారు. వచ్చిన వారందరికీ పదుల సంఖ్యలో చీరలు ఇస్తున్నారు. ఈ చీరలను మోసుకొంటూ వచ్చి సచివాలయం బయట పెట్టారు కొందరు వలంటీర్లు. ఆపై ఆటోలు పిలిపించి తమ ప్రాంతాలకు తీసుకెళ్లారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఫొటోలతో ఉన్న సంచుల్లో చీరలు పెట్టి తమ పరిధిలోని ఓటర్లకు వలంటీర్ల ద్వారా అందజేశారు. ఒకట్రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుందున్న ప్రచారం నేపథ్యంలో పుంగనూరు పట్టణంలో అధికార వైసీపీ నేతలు ఓటర్లకు పబ్లిక్‌గా తాయిలాలు అందజేశారు. పుంగనూరులో సీఐ, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది, సచివాలయ పోలీసులు, ఎన్నికల తాయిలాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ తదితర శాఖల అధికారులు కళ్లు, చెవులు మూసుకుని గాఢనిద్ర నటించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు యథేచ్ఛగా చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారు. దీనికి ప్రజల మధ్యన ఉండే సచివాలయాలనే పంపిణీ కేంద్రాలుగా ఎంచుకున్నారు. తమను అడిగేదెవరని ఇలా బరితెగించారు. వీటిని మహిళా ఓటర్లకు చేర్చే బాధ్యతను నేతలు వలంటీర్లకు అప్పగించారు.

పెద్దాయన ఇవ్వమన్నారంటూ..

సచివాలయాల నుంచి వలంటీర్లు చీరలు, బ్యాగులు తీసుకెళ్లడం పట్టణమంతా వ్యాపించింది. 16వ వార్డు సచివాలయం వద్ద ఎస్డీపీఐ నాయకులు వీడియో తీశారు. వలంటీర్లను ప్రశ్నించారు. పెద్దాయన ఇవ్వమన్నారని కొందరు.. మీకెందుకు చెప్పాలని ఇంకొందరు.. మమ్మల్ని ప్రశ్నించేందుకు మీరెవరని మరి కొందరు వారిని నిలదీశారు. కాగా, చీరల పంపిణీ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అయినా పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వ అధికారులు, పుంగనూరు సీఐ రాఘవరెడ్డి కనుసన్నల్లో పుంగనూరులో వైసీపీ చీరలు పంపిణీ చేసిందని కేంద్ర ఎన్నికల సంఘానికి బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్.. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఫిర్యాదు చేశారు.

కొసమెరుపు: వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని చీరలు ఇస్తున్నారు సరే. డబ్బులు ఎప్పుడు ఇస్తారని కొందరు ఓటర్లు వలంటీర్లను ప్రశ్నించినట్లు తెలిసింది.

- పుంగనూరు

ఆ చీరలు మావే

- 2020లో పోలీసులు సీజ్ చేసిన వాటిని వైసీపీ పంచుతోంది
- రామచంద్రయాదవ్ ఆగ్రహం

పుంగనూరు, మార్చి 13: పుంగనూరులో వైసీపీ తరపున పంచిన చీరలు నాలుగేళ్ల కిందట సీజ్‌చేసిన తమవని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. '2020 జనవరిలో నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి కానుకగా చీరలు, క్యాలెండర్ కిట్లు ఇవ్వడానికి బిల్లులు, పన్నులు చెల్లించి నేను తీసుకొచ్చా. అప్పటి పోలీసు అధికారులు అన్యాయంగా చీరలమాటున మద్యం బాటిళ్లు పెట్టారు. నన్ను రాజకీయంగా అడ్డుకొని మంత్రికి ఊడిగం చేయడానికి 50 వేల చీరలను సీజ్ చేశారు. పోలీస్ స్టేషన్లలో ఉండాల్సిన ఆ చీరలను కొందరు చెంచా పోలీసుల ద్వారా వైసీపీ నాయకులకు అందజేసి వాటిని పంపిణీ చేయడం సిగ్గుచేటు. ఆ చీరలకు సంబంధించి అన్ని బ్యాచ్ నెంబర్లు, బిల్లులు నా వద్ద ఉన్నాయి' అని చెప్పారు. తమ చీరలను పోలీసుల ద్వారా తీసుకుని వైసీపీ నాయకులు సిగ్గులేకుండా మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఫొటోలతో ఉన్న బ్యాగుల్లో పెట్టి వలంటీర్ల ద్వారా పంచడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. వందశాతం తాను తెప్పించిన చీరలను వైసీపీ పంపిణీ చేస్తుంటే ఎస్పీ, పోలీసు అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. తమ స్థాయిని దిగజార్చి అక్రమాలు, నీచమైన పనులకు పాల్పడుతున్న కొందరు పోలీసు అధికారులు రానున్న రోజుల్లో సమాధానం చెప్పకతప్పదని హెచ్చరించారు.

బీజేపీ నేతపై వైసీపీ దాడి

- మంత్రిపై పోస్టులు పెడతావా అంటూ దౌర్జన్యం
- ఫిర్యాదు తీసుకుని.. వెనక్కి ఇచ్చేసిన ఎస్‌ఐ
- పార్టీ పెద్దలకు సమాచారం ఇచ్చిన బాధితుడు



మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రేమ్‌కుమార్‌ను బయటకు పంపుతున్న వైసీపీ నాయకులు

పుంగనూరు, మార్చి 13: పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కో-కన్వీనర్, అడ్వకేట్ పూల ప్రేమ్‌కుమార్‌పై వైసీపీ నాయకులు దాడి చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పోస్ట్ పెడతావా అంటూ దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆయన బీజేపీ పెద్దలు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన ప్రకారం.. 'వ్యక్తిగత పనిపై మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి వస్తుండగా కారిడార్‌లో రాష్ట్ర జానపద కళల అకాడమీ చైర్మన్ కె.నాగభూషణం ఆపారు. మా పెద్దాయన (మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి) గురించి సోషల్ మీడియాలో వ్యతిరేకంగా పోస్టులు పెట్టే ధైర్యం ఎక్కడిదని గొడవ చేశారు. నీ పార్టీ ఏందీ, నిన్ను చంపితే నీకు బీజేపీ సపోర్టుగా వస్తుందా? నా ఏటిగడ్డపాళ్యంలో నీకేంటి పని అంటూ దుర్భాషలాడి దౌర్జన్యం చేశారు. వైసీపీ నేత జయకుమార్ యాదవ్ మరికొందరు చుట్టుముట్టి సెల్‌ఫోను లాక్కొని చైర్మన్ అలీంబాషా వద్ద ఇచ్చి కొట్టి షర్టు చింపారు. నేను ఒక్కడినే ఉన్న సమయంలో దాదాపు 30 మంది దాడికి పాల్పడ్డారు. అక్కడ ఉన్న మీడియా ప్రతినిధి వీడియో తీస్తుండగా ఆయన మొబైల్ లాక్కొని ఫొటోలు, వీడియోలు తీయొద్దని హెచ్చరించారు. నన్ను మెడపట్టి బయటకు నెట్టారు. పుంగనూరులో నేను హిందువులకు మద్దతుగా ఉండటం, ఏటిగడ్డపాళ్యంలోని ఆలయంపై జరిగిన దాడిపై పోరాడటం, బీజేపీలో చురుగ్గా ఉండటం వల్లే దౌర్జన్యానికి పాల్పడ్డారు. బీజేపీ నాయకులు అయాబ్‌ఖాన్, నరసింహులుతో పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐకి ఫిర్యాదు చేయడానికి వెళ్లగా ఆయన లేరు. ఎస్‌ఐ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేయగా, చాలా నిర్లక్ష్యంగా మాట్లాడి జీపులో బయలుదేరారు. ఫిర్యాదుకు రశీదు ఇవ్వాలంటూ నేను జీపు ముందు నిరసనగా కూర్చున్నా. నా ఫిర్యాదును ఎస్‌ఐ వెనక్కి ఇచ్చి వెళ్లిపోయారు' అని ప్రేమ్‌కుమార్ వివరించారు. ఎస్‌ఐ, సీఐ, డీఎస్పీ, ఎస్పీ, మానవహక్కుల సంఘం, రాజంపేట బీజేపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షురాలు, కేంద్రపెద్దలకు ఫిర్యాదును వాట్సప్, మెయిల్ ద్వారా పంపానన్నారు. పుంగనూరులో వైసీపీ అరాచకాలను, పోలీసుల ఏకపక్ష వైఖరిని బీజేపీ అగ్రనాయకులు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

బీసీ, ఎస్సీ ప్రజాప్రతినిధులకు అవమానం

- సచివాలయ ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించని వైనం



ఎమ్మెల్యేను నిలదీస్తున్న ఎంపీటీసీ సుబ్రమణ్యం

పెద్దపంజాణి, మార్చి 13: పెద్దపంజాణి మండలం వీరప్పల్లెలో సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో బీసీ మహిళా సర్పంచి, దళిత ఎంపీటీసీకి అవమానం జరిగింది. ఇక్కడ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను ఎమ్మెల్యే వెంకటేగౌడ బుధవారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ సుబ్రమణ్యం, వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వలేదు. దీనిపై సభా ప్రాంగణం వద్ద ఎమ్మెల్యే వెంకటేగౌడను వీరు నిలదీశారు. పోలీసులు రంగప్రవేశం చేసి వారిని పంపించేశారు. సమావేశ ప్రాంగణంలోకి రానీయకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణమని, ఈ ప్రభుత్వ పాలనలో ఎస్సీ, బీసీ ప్రజాప్రతినిధులకే అవమానం జరుగుతుంటే సామాన్యులకు ఏమి న్యాయం చేస్తారని విమర్శించారు. శిలాఫలకంలో పంచాయతీ పాలకవర్గాన్ని విస్మరించి పార్టీ నాయకుల పేర్లు, ఫొటోలు వేయడం ఎక్కడి ప్రొటోకాల్ అని ఎంపీటీసీ నిలదీశారు.

ఇంటర్ పరీక్షల్లో ఆరుగురి డీబార్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 13: జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్ సెకండియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్ 2 పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు డీఈఈవో సయ్యద్ మౌల తెలిపారు. వీరిలో ఎస్ఆర్ పేట సెంటర్‌లో ఇద్దరు, బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలోని నలుగురు ఉన్నారన్నారు. కాగా, 14349 మంది విద్యార్థులకు గాను 13523 మంది పరీక్షలకు హాజరు కాగా, 826 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.29

సహరి (శుక్రవారం) : 5.00

టీడీపీ ప్రచారాన్ని అడ్డుకున్న వైసీపీ

- ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు

యాదమరి, మార్చి 13: ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని వైసీపీ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు బాహాబాహీకి దిగగా.. పోలీసులు చెదరగొట్టి ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీ మోహన్ పది రోజులుగా మండలంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మోర్ధానపల్లె పంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్లి టీడీపీ చేపట్టబోయే సంక్షేమ పథకాలతో పాటు ఆరు గ్యారెంటీలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పెద్ద సంఖ్యలో జనం రావడం చూసి.. వైసీపీ సర్పంచ్ మీనా, ఆమె భర్తతో పాటు నాయకులు, కార్యకర్తలు టీడీపీ వారిని అడ్డుకున్నారు. తమ పంచాయతీలో కార్యక్రమాన్ని నిర్వహించకూడదన్నారు. దాంతో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య మాటామాటా పెరిగి బాహాబాహీకి దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాల వారిని చెదరగొట్టారు. పోలీసుల సమక్షంలోనే కోడిగుట్టకు చెందిన చిన్న అనే టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకులు దాడి చేశారని మురళీ మోహన్ ఆరోపించారు. అనంతరం టీడీపీ నేతలు, కార్యకర్తలను అక్కడ నుంచి పంపించేశారు. ఈ సంఘటనపై ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజినేయులు తెలిపారు.

స్వామి దర్శనం కోసం డబ్బు తీసుకున్న ఇద్దరి సస్పెన్షన్

ఐరాల(కాణిపాకం), మార్చి 13: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనం చేయిస్తామని భక్తుల వద్ద డబ్బు తీసుకున్న ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు బుధవారం తెలిపారు. స్వామి దర్శనానికి వెళ్లే రూ.150 టికెట్ కౌంటర్ వద్ద ఆలయానికి సంబంధించిన దినసరి కూలీ ఒకరు, మరో హోంగార్డు స్వామి దర్శనం త్వరితగతిన చేయిస్తామని తిరువణ్ణామలైకి చెందిన భక్తులకు చెప్పి రూ.1000 తీసుకున్నారన్నారు. దర్శనానంతరం ఆ భక్తులు ఈవో కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై సీసీ కెమెరాలను పరిశీలించి ఆ ఇద్దరిని గుర్తించినట్లు తెలిపారు. వారిని విచారించి సస్పెండ్ చేశామన్నారు. వారిపై కాణిపాకం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా కేసు నమోదైనట్లు వివరించారు. ఎవరైనా ఆలయ ఉద్యోగులు స్వామి దర్శనం కోసం డబ్బులు అడిగితే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని భక్తులకు సూచించారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి



కల్యాణ వేదిక వద్ద అనుగ్రహభాషణం చేస్తున్న కంచికామకోటి పీఠాధిపతి

ఐరాల(కాణిపాకం), మార్చి 13: మత మార్పిడులు చేయకుండా హిందువులు కలసి ఉండి, హిందూ ధర్మాన్ని కాపాడాలని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి సూచించారు. ధర్మ కార్యకలాపాలలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఆయన బుధవారం సాయంత్రం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాణిపాక ఆలయం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండి, మంచి పంటలు పండాలని స్వామిని కోరుకున్నట్లు తెలియజేశారు. కంచిపీఠం, కాణిపాకం అనుబంధంగా పౌరోహిత్యం, పద్ధతి పాఠశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశుతో చర్చించారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద అనుగ్రహభాషణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ జగన్నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, ఆలయ ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఉభయదారులు పాల్గొన్నారు.

మొగిలిలో వైభవంగా పష్పపల్లకి సేవ



బంగారుపాళ్యం, మార్చి 13: కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు పుష్పపల్లకిపై భక్తులకు దర్శనమిచ్చారు. బంగారుపాళ్యం మండలం మొగిలిలో ఉదయం మూలవర్లకు ఆలయ ప్రధాన అర్చకులు గంగాధర్ గురుకుల్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం అలంకార మండపంలో ఉత్సవమూర్తులను మురళీగురుకుల్ ఆధ్వర్యంలో అలంకరించి పుష్పపల్లకిపై ఊరేగించారు. బెంగళూరు నుంచి తీసుకొచ్చిన సుగంధభరితమైన పుష్పాలతో రథాన్ని సుందరంగా అలంకరించారు. బొమ్మాయిపల్లె చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, జీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత మమత ఈశ్వర నాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయ్‌కుమార్, ఈవో మునిరాజ, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు 24 బృందాల ఎంపిక



బహుమతులు అందిస్తున్న జిల్లా అధికారులు

గంగవరం, మార్చి 13 : రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరచిన 24 మంది జాతీయ ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌కు అర్హత సాధించారని డీఈవో దేవరాజులు తెలిపారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు స్థానిక మదర్‌థెరీసా కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌కు వివిధ జిల్లాల నుంచి 311మంది విద్యార్థులు హాజరై వారి నమూనాలను ప్రదర్శించారు. ఎన్‌ఐఎఫ్ (న్యూఢిల్లీ), గుజరాత్ నుంచి వచ్చిన డాక్టర్ మహిమ, అనంతగుప్త, సునీల్ భాస్కర్ జడ్జిలుగా వ్యవహరించి ప్రతిభ కనబరచిన వారిని జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేశారు. జాతీయ స్థాయికి ఎంపికైన వారిలో అన్నమయ్య జిల్లాకు చెందిన షేక్ రుక్సాన, వైఎన్ నిహాల్ కృష్ణ, కె.జ్యోతి(అనంతపురం), అనకాపల్లె జిల్లాకు చెందిన వి.గుణశ్రీకీర్తి, చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్.రాహుల్, లోక్ ప్రకాష్ చౌదరి, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కె.సత్యదుర్గ నాగేంద్ర కుమార్, బయశెట్టి లక్ష్మణ్, కృష్ణాజిల్లాకు చెందిన కె.నిహారిక, కాకినాడ జిల్లాకు చెందిన జి.అనుష్క, ఎం.దుర్గ సాయి, కోనసీమ జిల్లా నక్క సత్యప్రవీణ్, పల్నాడు జిల్లాకు చెందిన షేక్ రయాన్, షేక్ జమీర్, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన పి.వంశీ కుమార్, తిరుపతి జిల్లాకు చెందిన వి.నిరూష, గొల్లపల్లి రేష్మ, ఎం. వాణి, విజయనగరం జిల్లాకు చెందిన బి.నిహారిక, జి. పూజిత, కడప జిల్లాకు షేక్ ఆసిఫా, ఎం. రుగ్వేద వర్మ, బి. విజిత్ అభిలాష్, హైతన్ జైన్ తయారుచేసిన ఫార్ములాలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు. ఎంపికైన వారందరికీ సూపర్ బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, పద్మశ్రీ శ్రీనాథ్‌తో కలసి విద్యాశాఖ అధికారులు ప్రశంసా పత్రాలు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటరమణా రెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, డీఎస్‌వో రమణ, ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, సాయిలీల, లీలారాణి, పలు జిల్లాలకు చెందిన టీమ్ లీడర్లు, హెచ్ఎంలు, జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై వలంటీరు దాడి



గాయపడిన ఆనంద్ - వలంటీరుపై చర్యలు తీసుకోవాలని కమిషనరుకు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

పలమనేరు, మార్చి 13: పలమనేరు మున్సిపాలిటీ లోని టీఎస్ అగ్రహారం సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ఆనంద్‌పై వలంటీరు సురేష్ కుమార్, మరికొందరు దాడిచేసిన ఘటనపై బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి హాజరు కావాలని వలంటీరు సురేష్‌కుమార్‌కు ఆనంద్ సూచించారు. దీనిపై ఈనెల 10వతేది ఆనంద్ ఇంటివద్దకు సురేష్, మరో నలుగురు వెళ్లి కర్రలతో, ముష్టిఘాతాలతో భౌతిక దాడికి పాల్పడ్డారు. ఎడమ కన్ను, ఛాతీ వద్ద గాయాలయ్యాయి. ఆయన ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. ఈ ఘటనపై అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. దీనిపై బుధవారం పలమనేరు ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘ నాయకులు సీఐ చంద్రశేఖర్‌కు, మున్సిపల్ కమిషనరు రమణారెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి వలంటీరుతో పాటు అతడికి సహకరించిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకొంటామని అధికారులు వీరికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘ అధ్యక్షుడు ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.హరి, జిల్లా అధ్యక్షుడు రమణ, ఉద్యోగ సంఘ నాయకులు హైదర్, జలంధర్, మురళి, పుష్ప, గీతాంజలి, కళావతి, బాధిత ఉద్యోగి ఆనంద్ పాల్గొన్నారు.



వరసిద్ధుడి సేవలో విదేశీ భక్తులు

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని బుధవారం 46 దేశాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. వీరిలో ప్రధానంగా అమెరికా, కెనడా, యూకే, నెదర్లాండ్స్, జర్మనీ, రష్యా వంటి దేశాలకు చెందిన వారున్నారు.

- ఐరాల(కాణిపాకం)

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.13 కోట్లు



ఐరాల(కాణిపాకం), మార్చి 13: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,13,03,666 లభించినట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. బుధవారం ఆలయ సిబ్బంది ఆస్థాన మండపంలో స్వామి కానుకలను లెక్కించారు. ఈ ఆదాయంలో బంగారు 100గ్రాములు, వెండి 670గ్రాములు, 70 యూఎస్‌ఏ, 210 కెనడా, 60 న్యూజిల్యాండు డాలర్లు, 20 ఇంగ్లాండు పౌండ్లు లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.10,900, ప్రచార రథం హుండీ ద్వారా రూ.5,589 లభించినట్లు వారు తెలిపారు. ఈ ఆదాయం పూర్తిగా ఆలయానికి 19 రోజుల్లో సమకూరినట్లు వారు పేర్కొన్నారు. ఈ లెక్కింపులో ఏఈవోలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ. 80వేల గంజాయి సీజ్

● పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు



నిందితుడిని మీడియాకు చూపిస్తున్న సీఐ

చిత్తూరు, మార్చి 13: గంజాయి తరలిస్తున్న పాత కేసులో పరారీలో ఉన్న నిందితుడిని రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.80వేల విలువ చేసే గంజాయిని, ప్యాసింజర్ ఆటోను సీజ్ చేశారు. రెండో పట్టణ సీఐ ఉలసయ్య తెలిపిన ప్రకారం.. బుధవారం కాణిపాకం జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్యాసింజర్ ఆటోలో వస్తున్న సంతపేటకు చెందిన రవి కుమార్ అలియాస్ ఆటో రవిని అనుమానం వచ్చి తనిఖీ చేశారు. ఆ ఆటోలో ఉన్న రూ.80వేల విలువ చేసే రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆటో రవిని అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో ఓ కేసులో నిందితుడిగా ఉండి.. పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నట్లు తెలిసింది. అతడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషిచేసిన బాబు, హరిప్రసాద్, ధనరాజ్, మధు, గోవిందరావును సీఐ అభినందించారు.

జూన్ నెల రూ.300 ప్రత్యేక దర్శన టికెట్ల కోటా 25న విడుదల

18, 21 తేదీల్లో శ్రీవారి ఆర్జిత సేవల కేటాయింపు

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి జూన్ నెల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈనెల 25వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ కోటాను విడుదల చేయనున్నారు.ఇదే నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల లక్కీడిప్ కోసం భక్తులు ఈనెల 18వ తేదీ ఉదయం 10 నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు సేవలకు ఎంపికైన భక్తులు సొమ్ము చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. 21వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను విడుదల చేస్తారు. జూన్ 19 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న జ్యేష్టాభిషేక ఉత్సవాల్లో పాల్గొనేందుకు మార్చి 21న ఉదయం 10 గంటలకు టికెట్లు భక్తులకు అందుబాటులో ఉంచుతారు.అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి వర్చువల్ సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణీట్రస్టు దాతల దర్శనం, గదుల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్ల కోటాను విడదల చేస్తారు. మార్చి25న మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని గదుల కోటాను విడుదల చేస్తారు. 27న ఉదయం 11 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని శ్రీవారి సేవా కోటాను, అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ కోటాను,ఒంటి గంటకు పరకామణి సేవ కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు.

అలిపిరి టోల్‌గేట్ సిబ్బందికి మెమోలు

● చెక్ పాయింట్‌లో తనిఖీల తీరు మారాలంటూ ఆదేశం

● టోల్‌గేటుకు అదనంగా 20మంది గార్డుల కేటాయింపు



అలిపిరి టోల్‌గేట్‌లో బుధవారం నాటి తనిఖీలు

తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సిద్ధం సభ నుంచీ నిషేధిత వస్తువులతో ఆర్టీసీ బస్సులు తిరుమల కొండపైకి చేరుకున్న ఘటనలో నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించిన అలిపిరి టోల్‌గేట్ సిబ్బందికి టీటీడీ సీవీఎస్వో మెమోలు జారీ చేశారు. మద్యం గ్లాసులు, ఎముకలతో ఆర్టీసీ బస్సులు చెక్ పాయింట్ ఎలా దాటాయి? అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన వార్త టీటీడీ వర్గాల్లో కలకలం రేపింది. టీటీడీ సీవీఎస్వో ఈ వ్యవహారంలో బాధ్యులైన వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. వైసీపీ సభ నుంచీ నిషేధిత వస్తువులతో బస్సులు అలిపిరి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

చెక్‌పాయింట్ దాటిన సమయంలో విధుల్లో వున్న ఏడుగురు విజిలెన్స్ సిబ్బందిని, ఐదుగురు ఎస్పీఎఫ్ సిబ్బందిని తన కార్యాలయానికి పిలిపించి మందలించారని సమాచారం. వీరితో పాటు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌ను కూడా పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇక మీదట భద్రతా లోపాలు బయటపడితే చెక్‌పాయింట్ ఇన్‌చార్జిపై తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించినట్టు తెలిసింది. కాగా బుధవారం నుంచీ అలిపిరి చెక్‌పాయింట్‌లో తనిఖీలు ముమ్మరమయ్యాయి. తిరుమల నుంచీ అదనంగా 20 మంది గార్డులను అలిపిరి చెక్‌పాయింట్‌కే కేటాయించారు. ప్రతి యాత్రికుని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ క్రమంలో వాహనాలు టోల్‌గేట్ దాటడానికి ఆలస్యమైనా పరవాలేదని స్పష్టం చేసినట్టు సమాచారం. కాగా బుధవారం టోల్‌గేట్ వద్ద తనిఖీల తీవ్రత పెరిగింది. వాహనాల కదలికలు కూడా మందగించాయి. ఉన్నతాధికారుల ఆగ్రహంతో అప్రమత్తమైన చెక్ పాయింట్ సిబ్బంది కట్టుదిట్టంగా తనిఖీలు జరిపారు. తనిఖీల సందర్భంగా సెక్యూరిటీ గార్డులు కఠినంగా వ్యవహరించడంతో యాత్రికుల నుంచీ స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ బాటిళ్ళు భారీ సంఖ్యలో పోగుపడ్డాయి.

పలమనేరులో రూ.2 కోట్లకు ఐపీ

పలమనేరు, మార్చి 13 : పలమనేరుకు చెందిన వి.ఉదయ్‌కుమార్ రూ.1,98,65,500లకు ఐపీ దాఖలు చేసుకున్నారు. పలమనేరు మార్కెట్ కమిటీ సమీపంలో వ్యాపారం చేసుకునే ఉదయ్‌కుమార్ కనిష్టంగా రూ. రూ.45 వేలనుంచి అత్యధికంగా 19 లక్షల మేర 33 మంది వద్ద అప్పులు చేశాడు. అప్పులకు అధిక వడ్డీ కట్టలేక స్థానిక అడ్వొకేట్ అశోక్‌కుమార్ ద్వారా బుధవారం పలమనేరు కోర్టులో ఐపీ దాఖలు చేసుకున్నాడు. వారం క్రితమే ఉదయ్ కుమార్ పట్టణంలో కనిపించక పోవడంతో అతనికి అప్పులు ఇచ్చిన బాధితులు పలమనేరు పోలీసులకు కూడా ఫిర్యాదులు చేశారు. కాగా తీసుకొన్న అప్పులకు ఉదయ్ కనీసం చెక్కులు, బాండ్లు కూడా రాసివ్వలేదని తెలుస్తోంది.

చిత్తూరు ఎమ్మెల్యేకి తిరుపతి సీటు!

అభ్యర్థి ఎంపికకు జనసేన తీవ్ర కసరత్తు... పలువురి పేర్ల పరిశీలన

సర్వేలో వ్యతిరేకత వచ్చినా ఆరణి వైపే జనసేనాని మొగ్గు



తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జనసేన సీటు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఖరారైంది. టీడీపీ-బీజేపీలతో పొత్తు కూటమిలో వున్న జనసేనకు తిరుపతి సీటు కేటాయించిన సంగతి తెలిసిందే.టీడీపీ పరంగా తిరుపతి అసెంబ్లీ సీటు తొలినుంచీ కీలకమే. ప్రతిసారీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎంపికపై స్థానికంగానే కాకుండా జిల్లావ్యాప్తంగా కూడా జనం ఆసక్తి చూపుతుంటారు. అయితే ఈ పర్యాయం జనసేనతో పొత్తు కారణంగా అభ్యర్థి ఎంపిక మరింత ఆసక్తికరంగా మారింది. ఆరు నెలల కిందటే జనసేనతో పొత్తు వుంటుందని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో పొత్తులో భాగంగా తిరుపతి సీటు జనసేనకే కేటాయిస్తారన్న అంచనా జనంలో మొదలైంది. ఓ దశలో తిరుపతిలో అధికార పార్టీ అభ్యర్థిని ఢీకొనగలిగే వనరులు జనసేన నాయకులకు లేవన్న అభిప్రాయం కలగడంతో సీటు టీడీపీకే దక్కుతుందనే ప్రచారం జరిగింది. ఈలోపు సీట్ల సర్దుబాటు జరగడంతో తిరుపతి సీటు జనసేనకు కేటాయించారు. ఆ వెంటనే బీజేపీ కూడా కూటమిలో చేరడంతో తిరుపతి సీటును బీజేపీ కోరుతుందన్న ప్రచారం ప్రారంభమైంది. ఆలోగా చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆ పార్టీని వీడి జనసేనలో చేరిపోయారు. సీటు ఏ పార్టీకన్న ప్రచారాలు ఓవైపు సాగుతుండగానే మరోవైపు పరిణామాలు వేగంగా మారిపోయాయి.తిరుపతి సీటు జనసేనకు కేటాయించడంతో టీడీపీ నేతలు సుగుణమ్మ, ఊకా విజయ్ కుమార్ జనసేనలో చేరి టికెట్ తెచ్చుకునేందుకు సిద్ధపడ్డారు. వీరి ప్రయత్నాలు కొనసాగుతుండగానే రాజంపేట టీడీపీ నేత గంటా నరహరి బుధవారం జనసేనలో చేరారు. తిరుపతి టికెట్ కోసం ఒత్తిడి పెరగడంతో తొలుత చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. సర్వేలో ఆయన పట్ల అత్యధికులు వ్యతిరేకత కనబరిచినట్టు తేలడంతో ఆయన పేరు పక్కన పెట్టి గంటా నరహరి వైపు మొగ్గు చూపుతున్నారని జనసేన, టీడీపీ వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ గంటల వ్యవధిలో ఆరణి శ్రీనివాసులును అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటిస్తారని సమాచారం. కాగా ఈ పరిణామాలు తిరుపతి నియోజకవర్గ జనసేన, టీడీపీ వర్గాలలో కలకలం రేపాయి. స్థానికులైన బలిజలకే టికెట్ కేటాయించాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో చిత్తూరు ఎమ్మెల్యేకి టికెట్ ఖరారు చేయడం వివాదం రేగేందుకు అవకాశమిస్తోంది. ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వం పట్ల టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల స్పందన ఎలా వుంటుందో, రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ఈ రెండు పార్టీల్లో ఎలాంటి సమీకరణలకు దారితీస్తుందో వేచి చూడాల్సి వుంది.

శ్రీవారికి థ్యాంక్స్


- గామి సక్సెస్‌పై హీరో విశ్వక్ సేన్

తిరుమల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తన 'గామి' చిత్రం విజయవంతమైన నేపథ్యంలో శ్రీవేంకటేశ్వరస్వామికి థ్యాంక్స్ చెప్పడానికి తిరుమలకు వచ్చినట్టు హీరో విశ్వక్ సేన్ తెలిపారు. చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగిత, హీరోయిన్ చాందినితో కలిసి ఆయన బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం విశ్వక్‌సేన్ మీడియాతో మాట్లాడుతూ.. తన ప్రతి సినిమా విడుదలకు ముందు, తర్వాత స్వామి దర్శనానికి రావడం ఆనవాయితీ అన్నారు.'గామి' మంచి విజయాన్ని సాధించిన క్రమంలో స్వామికి ధన్యవాదాలు తెలిపేందుకు వచ్చానన్నారు. హీరోయిన్ చాందిని మాట్లాడుతూ.. గామి చిత్రాన్ని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలన్నారు. దర్శకుడు విద్యాధర్ మాట్లాడుతూ.. గామి విజయం ప్రేక్షకులు ఇచ్చిందన్నారు. విశ్వక్‌సేన్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. వారిలో కొంతమంది మొబైళ్లను విశ్వక్‌సేన్ సరదాగా లాక్కుని కాసేపు ఆటపట్టించాక తిరిగిచ్చేశారు. సాయంత్రం తిరుపతిలో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ నాలుగురోజులైనా కలెక్షన్స్ తగ్గలేదంటూ ఆనందం వ్యక్తం చేశారు.



విశ్వక్‌సేన్, చాందిని





ధ్వజావరోహణం - సింహాసనం, కామధేనువులపై శివపార్వతుల పురవిహారం

సింహాసనంపై శివయ్య వైభవం

● ముక్కంటి శివరాత్రి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం



ధ్వజావరోహణం సందర్భంగా పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 13: శ్రీకాళహస్తీశ్వరాలయ శివరాత్రి ఉత్సవాల్లో బుధవారం రాత్రి దేవరాత్రిని పురస్కరించుకొని శివపార్వతులు కైలాస మేరుపర్వత సింహాసనం, కామధేనువుపై పురవిహారం చేశారు.అంతకుముందు ఉత్సవాలకు ధ్వజావరోహణ కార్యక్రమం ఆలయంలో శాస్త్రోక్తంగా జరిగింది. అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ధ్వజ స్తంభం వద్ద కొలువుదీర్చారు. ఆ తరువాత యాగశాలలో పది రోజుల నుంచి పూజలందుకున్న స్వామి, అమ్మవార్ల ఆవాహన కలశాలకు పూజలు చేశారు. వేదోక్తంగా కలశ ఉద్వాసన పలికారు. అనంతరం యాగశాల నుంచి పవిత్ర కలశాలను అర్చకులు శిరస్సుపై దాల్చి ఆలయంలో ప్రదక్షిణ చేసిన తరువాత స్వామివారి ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి వృషభ సంకేత ధవళ పతాకం, కొడి వస్త్రాలు అవనతం చేశారు.అనంతరం ధవళ పతాకాన్ని, దారాన్ని చతుర్మాడ వీధుల్లో కొలువైన నవసంధి వినాయకులకు దర్శింపచేశారు. ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కేడిగ వాహనంపై ఊరేగించాక వసంత మండపంలో త్రిశూలానికి, స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.ఉత్సవాల్లో గురువారం విశిష్టమైన పల్లకీసేవను నిర్వహించనున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మొల్లమాంబ గొప్ప దార్శనికురాలు



కల్లూరు, మార్చి 13: కవయిత్రి మొల్లమాంబ గొప్ప దార్శనికురాలని రాష్ట్ర శాలివాహన సేవా సంఘం కన్వీనర్ గురుస్వామి తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేటలో బుధవారం కవయిత్రి మొల్లమాంబ జయంతి నిర్వహించారు. ముందుగా మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గురుస్వామి మాట్లాడుతూ పండితులకే కాదు పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని మొల్లమాంబ రచించిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుర్రప్ప, అరుణ, పార్వతమ్మ, హరిత, సుభద్ర, రమణ, నరసింహులు, గంగాధర్, గణేష్, అనిల్ పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

గుడుపల్లె, మార్చి 13: వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక నాయకులు, అధికారులదేనని ఎంపీపీ వరలక్ష్మి పేర్కొన్నారు. స్త్రీశక్తి భవనంలో బుధవారం ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని పలువురు సభ్యులు కోరారు. సౌకర్యాలు మెరుగు పరుస్తామని ఎంపీపీ తెలిపారు. చేసిన పనులకు బిల్లులురాక ఇబ్బందులు పడుతున్నామని ఎంపీపీ ఎదుట పలువురు వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సభ్యులకు ఎంపీపీ తెలిపారు. గత సమావేశంలో చర్చించిన అంశాలను ఏమి చేశారని పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. ఎంపీడీవో గోపి, జడ్పీటీసీ కృష్ణమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇంటింటికీ తెలుగుదేశంలో మాజీ మంత్రి అమర్



క్యాలెండరు ఆవిష్కరిస్తున్న అమరనాథరెడ్డి తదితరులు

పలమనేరు, మార్చి13 : పలమనేరు మున్సిపాలిటీలోని 20, 21, 22, 23 వార్డుల్లో బుధవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి అమరనాథరెడ్డి పర్యటించారు. పత్రమునస్వామి వీధి, కంసల వీధి, మారెమ్మగుడి వద్ద పార్టీ జండాలను ఆవిష్కరించి ప్రసంగించారు. అదేవిధంగా పారిశ్రామిక వేత్త పల్లెరుచులు అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో స్వరపరచిన రెండు పాటలను, టీడీపీ నాయకులు ముద్రించిన క్యాలెండర్లను అమరనాథరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్వీబాలాజి, ఆర్బీసీ కుట్టి, నాగరాజు, గిరిబాబు, సుబ్రమణ్యంగౌడు, ఖాజాపీర్, చాంద్‌బాషా, మదన్‌మోహన్, శ్రీధర్, కోటి, లోకేష్ఆచారి, శ్రీనివాసులు, కుమార్, మోహన్, బాబు, చిన్ని, సుబ్బు, యువరాజు, జనసేన నాయకులు దిలీప్, చైతన్య హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అంటేనే శవ రాజకీయం : టీడీపీ

పలమనేరు,మార్చి13 :శవ రాజకీయం అంటేనే వైసీపీ అని, వైసీపీ అంటేనే శవరాజకీయం అని టీడీపీ నాయకులు అన్నారు. గంగవరంలో మంగళవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ టీడీపీ సోషియల్ మీడియాపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ టీడీపీ నాయకులు బుధవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ దళితులకు ఈ ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్యే కంట తడిపెట్టడం హాస్యాస్పదం, మీవల్ల నాలుగున్నర ఏళ్లలో ఎంతమంది కన్నీరు పెట్టుకొన్నారో మీకు గుర్తు లేదా అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు నాగరాజు,మదన్‌మోహన్, సుబ్రమణ్యంగౌడు, గిరిబాబు పాల్గొన్నారు.

వేలం పాటల్లో మున్సిపాలిటీకి తగ్గిన ఆదాయం

పుంగనూరు, మార్చి13: పుంగనూరు మున్సిపాలిటీకి వివిధ రకాల వేలం పాటల నుంచి గత ఏడాది రూ. 31.56లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ. 29.96లక్షలకు తగ్గిపోయింది. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వారపు సంత, కూరగాయల దినసరి సంత, మరుగుదొడ్లకు బహిరంగ వేలం పాటలను మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి నిర్వహించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది వేలం పాటల్లో రూ.1.60లక్షలు తగ్గినట్లు ఆయన తెలిపారు. వారపుసంత గత ఏడాది రూ. 8.51 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ. 8.52లక్షలు, దినసరి కూరగాయల మార్కెట్ గతేడాది రూ. 8.51లక్షలు రాగా ఈ ఏడాది రూ.8.53లక్షలు, ప్రజా మరుగుదొడ్లు 6.53లక్షలు రాగా ఈ ఏడాది రూ. 6.45లక్షలు, ప్రైవేటు బస్టాండ్ నుంచి గత ఏడాది రూ. 8.01లక్షలు రాగా ఈ ఏడాది రూ. 7.01లక్షలు వేలం ద్వారా ఆదాయాలు చేకూరినట్లు తెలిపారు.

వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించం

బైరెడ్డిపల్లె, మార్చి 13 : టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడుపై వైసీపీ శ్రేణులు వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేదిలేదని టీడీపీ నాయకులు హెచ్చరించారు. బైరెడ్డిపల్లెలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నోయేళ్లుగా ప్రజలకు నిస్వార్థ సేవలందిస్తున్న కిశోర్‌గౌడు కుటుంబాన్ని విమర్శించే అర్హత ఎవరికీ లేదన్నారు. బైరెడ్డిపల్లెలో సేవాకార్యక్రమాల కోసం కిశోర్‌గౌడు కుటుంబీకులు విలువైన భూములు వితరణగా అందజేశారన్నారు. ఏదైనా మాట్లాడేముందు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు లోకనాథరెడ్డి, సురేష్, నాగరాజు, చలపతి, రమేష్, మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెనమాకులపల్లె పంచాయతీకి రూ.22లక్షల ఆదాయం

శాంతిపురం, మార్చి13: కెనమాకులపల్లె పంచాయతీకి బడుగుమాకులపల్లె ఆదివారపు సంత వేలం ద్వారా రూ. 22లక్షలు ఆదాయం వచ్చింది. కెనమాకులపల్లె సచివాలయం ఆవరణలో బుధవారం వేలం పాటలు నిర్వహించారు. పశువుల సంతను వి.కోటకు చెందిన శ్రీనివాసులు రూ.8,71,00లకు, కూరగాయలు, అంగళ్ళు వారపు సంతను శాంతిపురం మంగమ్మ రూ. 3,70,000లకు, ప్రైవేటు వాహనాల వారపు సంతను గడ్డూరు గ్రామానికి చెందిన ఈ రమేష్ రూ. 4,99,000లకు, గొర్రెలు, కోళ్ళ వారపు సంతను శాంతిపురానికి చెందిన సుబ్రమణ్యం రూ.4,60,000లకు కైవసం చేసుకున్నారు. వేలం పాటలో జడ్పీటీసీ శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనారాయణ, సర్పంచ్ జయరాం, ఎంపీటీసీ రాజా, ఉప సర్పంచ్ అప్పిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు నిషార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీవి మోసపూరిత మాటలు

పుంగనూరు రూరల్: వైసీపీ రాజకీయ లబ్ధి కోసం మోసపూరిత మాటలు చెప్పడం ముస్లింలు నమ్మరని పుంగనూరు టీడీపీ మైనార్టీ నాయకుడు ఎస్. సుహేల్ బాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, జనసేన, టీడీపీ పొత్తు పెట్టుకోవడంతో వైసీపీ జీర్ణించుకోలేకపోతోందన్నారు. నియోజవర్గంలో ముస్లిం యువతపై తప్పుడు కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాల వల్ల మైనార్టీలకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు.

బోరులారీ బోల్తా

పుంగనూరు రూరల్: పుంగనూరు-తిరుపతి మార్గంలోని చదళ్ల పంచాయతీ గొల్లపల్లె సమీపంలో బోరు లారీ బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పి బోల్తాపడింది. పుంగనూరు నుంచి చౌడేపల్లెకు వెళ్లుతుండగా అదుపు తప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. లారీ డ్రైవర్ బాబుకు స్వల్పగాయాలు తగిలాయని తెలిపారు.

వస్త్ర వ్యాపారికి జరిమాన

చౌడేపల్లె : బిల్లులు సక్రమంగాలేని బట్టల వ్యాపారికి తూనికలు కొలతల శాఖ అధికారిణి రమాదేవి జరిమాన విధించారు. బుధవారం ఆమె చౌడేపల్లె బస్టాండులోని ఓ బట్టల దుకాణాన్ని తనిఖీ చేసి ఎంఆర్పీ ధరలు సక్రమంగా లేవని ఆ యజమానికి రూ.6వేలు జరిమాన విధించినట్లు తెలిపారు.

మహిళలకు మరో వరం మహాలక్ష్మి పథకం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మునిరత్నం

రామకుప్పం, మార్చి 13: టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళా స్వావలంబనకు కృషి చేస్తోందని, ఇటీవల పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మహాలక్ష్మి పథకం మహిళలకు టీడీపీ అందిస్తున్న మరో వరమని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం, చంద్రబాబు పీఏ మనోహర్ తెలిపారు. బుధవారం రామకుప్పంలో నిర్వహించిన మహిళా సాధికార సారథులు శిక్షణ శిబిరంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ ఇబ్బందులను గుర్తించిన చంద్రబాబు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం మహాలక్ష్మి పథకం ప్రకటించారన్నారు. మహాలక్ష్మి పథకంలోని అంశాలను సాధికార సారథులు ఇంటింటా వివరించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, నాయకులు మునస్వామి, పట్రనారాయణాచారి, ఆంజినేయరెడ్డి, చలపతి, కొళ్ళపల్లెబాబు, సీతాపతి, మహ్మద్‌రఫీ, నందారెడ్డి, బాలరాజు, వెంకటరమణ, మంజునాథ్, ఆదిల్, అనసూయ పాల్గొన్నారు.

కుప్పం : కుప్పంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం గుడుపల్లె మండలం 3వ క్లస్టర్‌కు చెందిన కుటుంబ సాధికార సారథులైన మహిళలకు సూపర్ సిక్స్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎస్. మునిరత్నం మాట్లాడుతూ ఆరు పథకాలు అద్భుతమైనవని, మహిళల జీవితాల్లో ఈ పథకాలద్వారా వెలుగులు విరబూస్తాయని చెప్పారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కుప్పంలోని ఎన్టీఆర్ కాలనీ, వడ్డిపల్లె ప్రాంతాల్లో బుధవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, చంద్ర బాబు పీఏ మనోహర్, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమం లో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి సత్యేంద్రశేఖర్, యూనిట్ ఇన్‌ఛార్జి ముఖేశ్ కుమార్, వార్డు అధ్యక్షుడు ఇర్ఫాన్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిపురం : మండలంలోని అబకలదొడ్డి పంచాయతీ కాకర్లవంకలో బుధవారం టీడీపీ జెండా స్థూపాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆవిష్కరించారు. అంతకు ముందు జంగాలపల్లె, అబకలదొడ్డి, కాకర్లవంక, కోతిగుట్లపల్లె, వెంకటాపురం, ఎదురగుట్టపల్లె గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంచుతూ సూపర్ 6 పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, చంద్రబాబు పీఏ మనోహర్, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, నాయకులు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, ఆంజనేయరెడ్డి, నాగరాజు, ఏఎంసీ నాగరాజు, చంద్రశేఖర్, రాజేంద్ర, సుబ్రమణ్యం, శకుంతల, ఎంపీపీ పుష్ప, శ్యామల, రూప, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక

కుప్పం, మార్చి 13: కుప్పం మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం భారీగా టీడీపీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ చేరికలు జరిగాయి. వసనాడు పంచాయతీకి చెందిన శివ, రియాజ్, మునికృష్ణ, కృష్ణప్ప, చినబ్బయ్య, పెద్దబంగారునత్తం పంచాయతీకి చెందిన మాజీ ఎంపీటీసీ అర్జున్, వీరప్పన్, కృష్ణమూర్తి, నడిమూరు పంచాయతీనుంచి ఇండిపెండెంట్ సర్పంచి అభ్యర్థిగా పోటీచేసిన ప్రభాకర్ టీడీపీలో చేరినట్లు ప్రేమ్‌కుమార్ తెలిపారు. వీరందరికీ పార్టీ కండువా కప్పి చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే శాంతిపురం మండలం చౌడంపల్లె గ్రామానికి చెందిన దళిత నాయకుడు కందస్వామి కుమారుడు సురేశ్ వైసీపీ నుంచి తన అనుచరులైన 15 కుటుంబాలతో సహా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. దళిత నాయకుడు కన్నన్‌తోపాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మరోవైపు కుప్పం టీడీపీ కార్యాలయంలో గుడుపల్లె మండలం కోటచెంబగిరి గ్రామానికి చెందిన 14 కుటుంబాలు టీడీపీలో చేరాయి.



సామగుట్టపల్లెలో రాత్రికి రాత్రి భూమి చదును

వైసీపీ నేతలపై కబ్జా ఆరోపణలు

కుప్పం, మార్చి 13: కుప్పం పురపాలక సంఘం సామగుట్టపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి పొక్లయినర్లతో భూమిని చదును చేయడం వివాదానికి దారితీసింది. ఈ భూమిని వైసీపీ నేతలు కొందరు కబ్జా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తగా, కాదు తమకు పట్టాలిచ్చేందుకే భూమిని చదును చేశారని గ్రామస్థులు కొందరు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. సామగుట్టపల్లె రెవెన్యూ గ్రామం కదిరిబండ ప్రాంతంలో సుమారు 80 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలతోపాట తదితర ప్రభుత్వ భవనాలు నిర్మించడానికి ఈ భూమిని గుర్తించారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదన మూలనపడింది. అయితే మంగళవారం రాత్రి రెండు పొక్లయినర్లతో ఈ భూమిని కొందరు వ్యక్తులు చదును చేయడం కలకలం రేపింది. వైసీపీ నేతలు కొందరు భూమిని కబ్జా చేస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ ఆరోపణలను బుధవారం గ్రామస్థులు కొందరు ఖండించారు. వార్డులోని పేదలైన తాము ఇళ్లపట్టాలకోసం ఎమ్మెల్సీ భరత్‌ను కోరగా సదరు భూమిని కేటాయించారని వారు తెలిపారు. ఆలస్యం చేస్తే ఎన్నికల కోడ్ వస్తుందని భావించి అర్ధరాత్రి అయినా సరే, ఆ భూమిని చదును చేశామన్నారు.



చదును చేసిన వివాదాస్పద భూమి

ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

కుప్పం, మార్చి 13: కుప్పంలోని నేతాజీరోడ్డులో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్మన్ నారా భువనేశ్వరి కుప్పం వచ్చినప్పుడు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం కావాలంటూ స్థానిక మహిళలు ఆమెను కోరారన్నారు. అప్పట్లో ఆమె ఇచ్చిన హామీని గుర్తుంచుకుని ఇప్పుడు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్ మాట్లాడుతూ భువనేశ్వరి ఆదేశాల మేరకే ఈ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని కుప్పంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణ పొంది, తద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో రాజేంద్రప్రసాద్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

సదుం, మార్చి 13: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాకారమవుతుందని సదుం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం, పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికబద్ధంగా సిద్ధమైతే ఒత్తిడి ఉండదని విద్యార్థులకు తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రాజారెడ్డి గత ఏడాది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.5 వేల నగదు ప్రోత్సాహకాలు అందించారు. ప్రస్తుతం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు తమ పాఠశాలకు రూ.42 వేలు విలువజేసే మైక్‌సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీరాములు, దామోదర్, సర్పంచ్ మనోహర్ రెడ్డి, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, మాజీ హెచ్ఎం ఫజురుల్లా, విశ్రాంత ఎంఆర్పీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రామకుప్పం, మార్చి 13: స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ ఛైర్మెన్ డా.సుధీర్, రెస్కో ఛైర్మెన్ సెంథిల్ కుమార్, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు విజలాపురంబాబు, చంద్రారెడ్డి, వైసీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఇరుగాలమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

శాంతిపురం, మార్చి 13: మండల పరిధిలోని వరదేపల్లెలో ఇరుగాలమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం గ్రామస్థులు వైభవంగా జరుపుకొన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, రంగురంగుల పూలతో ముస్తాబు చేశారు. వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవర్లను వీధుల్లో ఊరేగించారు.



ఉయ్యాలవాడ విగ్రహ ఏర్పాటుకు వినతి

రామకుప్పం, మార్చి 13: పట్టణ శివార్లలోని బందార్లపల్లె క్రాస్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని రెడ్డిసంఘం మండల నేతలు బుధవారం డిప్యూటీ తహసీల్దారు దిలిప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్థలం కేటాయింపు విషయమై ఉన్నతాధికారులకుయ నివేదిస్తామని డిప్యూటీ తహసీల్దారు వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డిసంఘం నేతలు నితిన్‌రెడ్డి, చంద్రారెడ్డి, కేశవరెడ్డి, పాపిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే భావితరాల భవిష్యత్తు బాగు

రామకుప్పం, మార్చి 13: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే భావితరాల భవిష్యత్తు బాగుంటుందని చెల్దిగానిపల్లె మాజీ సర్పంచు సురేష్, కెంచనబల్ల యూనిట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ నేతలు సత్తి, రమేష్ తెలిపారు. బుధవారం వారు చెల్దిగానిపల్లె, కెంచనబల్లలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అట్టడుగు వర్గాల ప్రజలు, ముఖ్యంగా యువతకు తీరని అన్యాయం జరిగిందన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదగాలన్నా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలన్నా అది టీడీపీ పాలనలోనే సాధ్యమవుతుందన్నారు. . టీడీపీ ఘనవిజయం సాధించి చంద్రబాబు సీఎం కావడం తథ్యమని వారు ధీమా వ్యక్తం చేశారు.ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పంచాయతీ అధ్యక్షులు మంజునాథ్, గుణశేఖర్, రెడ్డిపురుషోత్తం, రామాంజులు, రమేష్, చంద్రకుమార్, చిన్నసురేష్, ఉదయ్, అమరేష్, మురుగేష్, మతీన్, వెంకట్రామ పాల్గొన్నారు.

తల్లి మందలించిందని పురుగులమందు తాగిన యువకుడు

పుంగనూరు రూరల్, మార్చి13: తల్లి మందలించిందని ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం రామసముద్రం మండలంలో చోటుచేసుకుంది. రామసముద్రం మండలం గజ్జిగంగనపల్లెకు చెందిన వెంకట్రమణ కుమారుడు వినోద్(27) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజు వినోద్ ఉదయం నిద్రలేవలేదని తల్లి మందలించడంతో పంటల కోసం తెచ్చిన పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో వుండటం గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతన్ని పుంగనూరు ఆసుపత్రికి తరలించారు.

తెలుగు మహిళ నేతకు ఆర్థిక సాయం

రామకుప్పం, మార్చి 13: రామకుప్పం మండలం ననియాలతాండా పంచాయతీకి చెందిన తెలుగు మహిళ అధ్యక్షురాలు ఇంద్రాణి భర్త ఇటీవల మృతి చెందారు. బుధవారం రామకుప్పంలో జరిగిన టీడీపీ మహిళా సాధికార సారథుల సమావేశంలో ఆమెకు తెలుగు మహిళ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రకళ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

గాలిగోపుర నిర్మాణానికి భూమి పూజ

పలమనేరు, మార్చి 13 : పలమనేరు కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో 5 అంతస్తుల గాలిగోపురం నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతులమీదుగా భూమి పూజ చేశారు. దేవదాయ శాఖ గాలిగోపురం నిర్మాణానికి రూ.1.23 కోట్లు మంజూరు చేసింది. ఇందులో దేవదాయశాఖ రూ. 98,400 చెల్లిస్తుండగా, మిగిలిన 24.6 లక్షలను దాతలు చెల్లించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంటే వీరభద్ర, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఛాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

పలమనేరు, మార్చి13 : పట్టణంలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కార్యక్రమంతోపాటు ర్యాలీలు నిర్వహించారు. ప్రతి ఓటరు రానున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని వారు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయాల సెక్రటరీలు, బీఎల్ఓలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

కల్లూరు, మార్చి 13: క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమని జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదలి, హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. కల్లూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం కల్లూరు లయన్స్‌క్లబ్ వారు బహుమతులు అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రకాష్, వెంకటశిద్దులు, రాజేంద్ర, లియో క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరులో పోలీసు కవాతు

కల్లూరు, మార్చి 13: ప్రజల్లో విశ్వాసం కల్పించేందుకే పోలీసు ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. కల్లూరు పట్టణంలో బుధవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంతో సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. పోలీసు కవాత ఉన్నత పాఠశాల నుంచి పుంగనూరు రోడ్డు, బస్టాండు కూడలి, పీలేరు రోడ్డు వరకు నిర్వహించారు.

రొంపిచెర్లలో ...

రొంపిచెర్ల, మార్చి 13 : రానున్న ఎన్నికల నేపథ్యంలో కల్లూరు సీఐ శ్రీనివాసులు ఎస్ఐ సుకుమార్‌తో కలిసి రొంపిచెర్ల మండలంలో బుధవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. గానుగచింత, దుస్సావారిపల్లె, బొమ్మయ్యగారిపల్లె, పెద్దగొట్టిగళ్లు తదితర ప్రాంతాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి.

టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, మార్చి 13: మండలంలోని బల్లకు చెందిన బత్యప్ప, మిట్టపల్లెకు చెందిన జయప్ప, సింగసముద్రానికి చెందిన సర్ఫ్‌నిషా అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

అన్నదానం



పలమనేరు, మార్చి 13 : టీఎస్ అగ్రహారం వద్ద కాలనీలో నివాసముంటున్న నిరుపేదలకు బుధవారం పలమనేరుకు చెందిన సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు పలావ్ అన్నం అందజేశారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు, చిన్నపిల్లలకు గిన్నెలలో పలావ్ అన్నం అందజేశారు.

టీడీపీ నేతల బైండోవర్

రామకుప్పం, మార్చి 13: ననియాలకు చెందిన టీడీపీ బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మనోహర్, 89పెద్దూరు యూనిట్ ఇన్‌చార్జి గజేంద్ర, యువనేత చరణ్‌లను రామకుప్పం పోలీసులు బుధవారం విజయపురం తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు. నేతలు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తమపై తప్పుడు కేసులు నమోదు చేసిన పోలీసులు తగు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

కుప్పం, మార్చి 13: వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని, చేకూరిన సంక్షేమాన్ని చూసి తమ ఓటేయాలని ఎమ్మెల్సీ భరత్ ప్రజలను కోరారు. కుప్పం పురపాలక సంఘం సామగుట్టపల్లెలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభం



రొంపిచెర్ల, మార్చి 13: మండలంలోని జాండ్లవారిపల్లెలో, చెంచమరెడ్డిగారిపల్లెలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్లు, బండకిందపల్లె పాఠశాల భవనాన్ని బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ నాగిరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మి, ఎంపీడీవో రెడ్డెప్పఆచారి, తహసాల్దార్ మోహిద్దీన్, ఏఈ రాంప్రసాద్ పాల్గొన్నారు.

నీలగిరి చెట్లు దగ్ధం

చౌడేపల్లె, మార్చి13: చౌడేపల్లె సమీపంలో చెడుగుట్లపల్లెకు వెళ్లే మార్గంలో బుధవారం రామచంద్రకు చెందిన నీలగిరి తోట, చింత చెట్టులో అగ్ని మంటలు చెలరేగడంతో అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చి చుట్టుపక్కల మామిడి తోటలకు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు.

చౌడేపల్లె ఎంపీడీవోగా శివప్రసాద్



చౌడేపల్లె, మార్చి13: చౌడేపల్లె ఎంపీడీవోగా శివప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో వెంకటేష్ ఐరాలకు బదిలీ కావడంతో కేవీబీపురం, అక్కడి నుంచి చౌడేపల్లె ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు.

చేయూత చెక్కుల పంపిణీ

శజాంతిపురం, మార్చి 13 : మండల సచివాలయ ఆవరణలో బుధవారం వైఎస్ఆర్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ భరత్ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాసులు, ఏపీవో గ్రీటా, సర్పంచ్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: థామస్



థామస్‌కు హారతులు ఇస్తున్న మహిళలు

పెనుమూరు, మార్చి 13: రాష్ట్రం అభివృద్ధి చెందాల న్నా, ప్రజలు సంతోషంగా జీవించాల న్నా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని జీడీనెల్లూరు అభ్యర్థి డాక్టర్ థామస్ అన్నారు. బుధవారం కత్తిరెడ్డిపల్లి పంచాయతీలో మీ ఇంటికి మీ థామస్, బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండల నాయకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ప్రజలందరూ రాబోవు ఎన్నికల్లో సైకిల్ గుర్తుకి ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, పార్లమెంటు కార్యదర్శి తలారి రెడ్డెప్ప, మనోహర్‌రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, చిరంజీవిరెడ్డి, భాస్కర్, అశోక్, షణ్ముఖవర్మ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో...

కార్వేటినగరం, మార్చి 13: కార్వేటినగరం మండలం, ఆర్‌కేవీబీపేటలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరలో బుధవారం టీడీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ థామస్ పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి యుగంధర్, స్థానిక టీడీపీ నాయకులు నాగభూషణం, త్యాగరాజు, రామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మాధవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

విజయపురం, మార్చి 13: మండలంలోని మాధవరంలో టీడీపీ సీనియర్ నాయకుడు జయరాజ్, సెల్వం, పన్నూరు దళితవాడలో టీడీపీ నాయకుడు శరత్, గొల్లకండ్రిగలో తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, గొల్లకండ్రిగ దళితవాడలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు మహేంద్రన్, జంబాడలో రవిరాజు ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షూరికాపురంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

చిట్టిబాబుకు ఘన సన్మానం



భీమనేని చిట్టిబాబును సన్మానిస్తున్న పాలసముద్రం మండల వాసులు

పాలసముద్రం, మార్చి 13: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడును బుధవారం బెంగళూరులో స్థిరపడిన మండలవాసులు ఘనంగా సన్మానించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం ప్రజలు బెంగళూరులో స్థిరపడిన వారందరి ఇళ్ల వద్దకు భీమనేని చిట్టిబాబు నాయుడు వెళ్లి రాబోవు అసెంబ్లీ ఎన్నికలప్పుడు తమతమ సొంత గ్రామాలకు వచ్చి టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్ గెలుపుకోసం కృషిచేయాలని కోరారు. బెంగుళూరులో ఉన్నవారంతా తమ సొంత గ్రామాలకు వచ్చి తమ బంధువులు, స్నేహితులతో టీడీపీకి ఓటువేయడానికి సహకరించాలని ఆయన కోరారు.

ప్రైమరీ పాఠశాలలో ఫ్రూట్స్ డే



ఫ్రూట్ స్టాల్‌తో పాటు విద్యార్థులు

కార్వేటినగరం, మార్చి 13: కార్వేటినగరం శ్రీలక్ష్మీనరసింహ విద్యా సంస్థల్లో ప్రైమరీ స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం ఫ్రూట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ పురోహిత్ ఆయా సీజన్లలో వచ్చే పండ్లను తీసుకోవడం వల్ల పరిపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సూచించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫ్రూట్ స్టాల్ అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల నిర్వాహకులు దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తవణంపల్లె తహసీల్దార్‌గా అరుణ కుమారి

తవణంపల్లె, మార్చి 13: తవణంపల్లె తహసీల్దార్‌గా అరుణకుమారి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె చిత్తూరు రూరల్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ, బదిలీపై తవణంపల్లె తహసీల్దార్‌గా నియమితులయ్యారు. తవణంపల్లె తహసీల్దార్ హసీనాబేగంను చిత్తూరు రూరల్‌కు బదిలీ చేస్తూ కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు.

పారిశుధ్య పనుల తనిఖీ

చిత్తూరు, మార్చి 13: నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ అరుణ బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొంగారెడ్డిపల్లె, చర్చివీధిలో మేజర్ డ్రైన్లను పరిశీలించారు. వేసవి నేపథ్యంలో నగరంలోని మేజర్, మైనర్ డ్రైన్లను పూర్తిస్థాయిలో పూడికతీత పనులను చేపట్టాలన్నారు. రాములగుడి వీధి కూడలి వద్ద చేపట్టిన ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం

కార్వేటినగరం, మార్చి 13: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద బుధవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా తమ పేర్లను ఆలయంలో నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ సూచించారు.

పూతలపట్టులో...



అన్నదానం చేస్తున్న యువరాజులు నాయుడు తదితరులు

పూతలపట్టు, మార్చి 13: మండలంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద వున్న అన్నక్యాంటీన్‌లో బుధవారం కొత్తూరు గ్రామానికి చెందిన ఎండీ నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యువరాజులు నాయుడు, గంగారపు గోపి, దొరబాబు చౌదరి, హేమాద్రి, హిమగిరి నాయుడు, నాగయ్య, సుబ్బరాజులు, దాము, మంజునాథ్, వీరభద్రయ్య, ఏకాంబరం, ఊట్ల నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో తదితరులు

నగరి, మార్చి 13: ఓటు హక్కును నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని నగరి ఆర్డీవో వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. నగరి ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు కులాలకతీతంగా, నీతి, నిజాయతీ కలిగిన వ్యక్తికి ఓటు వేసి ఎంపిక చేసుకోవాలని సూచించారు. నగరి మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, మెప్మా జిల్లా సమన్వయకర్త శ్రీబాబా, పట్టణ మెప్మా అధికారిణి సునీత, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వైభవంగా ఏకాంబరేశ్వరుడి పల్లకి సేవ



యాదమరి, మార్చి 13: యాదమరి ఏకాంబరేశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన బుధవారం స్వామి అమ్మవార్లకు ఆలయ నిర్వాహకులు పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో యాదమరి పురవీధుల్లో ఊరేగించగా, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులకు, భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

వెదురుకుప్పం, మార్చి 13: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణులై ఉన్నత స్థాయికి ఎదగాలని వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ ఆకాంక్షించారు. బుధవారం ఆ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ డాక్టర్ మునికృష్ణయ్య అధ్యక్షతన వార్షికోత్సవ, వీడ్కోలు సమావేశం జరిగింది. అనంతరం క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఉపాధ్యాయులు ఆశీసులు అందించారు. ఉపాధ్యాయులు పుత్తూరు మురళీరెడ్డి, కమలనాభన్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీగా

మార్జ అలీ అక్బర్ నియామకం



చిత్తూరు కల్చరల్, మార్చి 13: చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీగా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం మార్జ అలీ అక్బర్‌ను నియమిస్తూ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అలీ అక్బర్ 10 సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగనున్నారు. చిత్తూరు ప్రభుత్వ ఖాజీగా నియమితులైన అలీ అక్బర్‌ను నగరంలోని ముస్లిం మత పెద్దలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు అభినందించారు.

కేంద్ర బలగాల కవాతు



పెనుమూరులో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

పెనుమూరు, మార్చి 13: రానున్న ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు ఈస్ట్ సీఐ కుళ్లాయప్ప ఆధ్వర్యంలో పెనుమూరు, ఉగ్రాణంపల్లి, శాతంబాకంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పోలీసుల పర్యవేక్షణను ప్రజలకు తెలియజేయడానికే ఈ కవాతు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్‌ఐ ఉమామహేశ్వర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లెలో...

తవణంపల్లె, మార్చి 13: రానున్న ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మండలంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటును వినియోగించుకోవాలని, ప్రజలకు రక్షణగా మేమున్నామని భరోసా కల్పిస్తూ తవణంపల్లె పోలీసు స్టేషను పరిధిలోని అరగొండ, గాజులపల్లె, తవణంపల్లె, తెల్లగుండ్లపల్లె గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీ ప్రభుత్వమే

గుడిపాల, మార్చి 13: రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని గోళ్ళతిమ్మ య్యకండ్రిగలో ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి పవిత్ర ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి పూజలు నిర్వహించారు. అనంతరం నారగల్లు కాలనీలో టీడీపీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు పాస్టర్లు చెప్పడంతో వారిని టీడీపీ నాయకులు సన్మానించారు.

నీరుగారుతున్న సమాచారహక్కు చట్టం

చిత్తూరు సిటీ, మార్చి 13: సమాచారహక్కు చట్టం నీరుగారుతోందని ఏపీ బీసీ విద్యార్థి విభాగం రాయలసీమ అధ్యక్షుడు వాసు కుమార్ ఆరోపించారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు డ్రా చేసిన ఇంటర్నెట్ చార్జీల బిల్లులకు సంబంధించి జిరాక్స్‌కాపీలు ఇవ్వాలని సమాచారహక్కు చట్టం ద్వారా కోరామని చెప్పారు. కాగా మూడు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం ద్వారా తాను కోరిన వివరాలు ఇప్పించాలని కోరారు.

వేలాంకన్ని యాత్రకు ఉచిత బస్సులు

చిత్తూరు రూరల్, మార్చి 13: చిత్తూరు రూరల్ మండలం, తుమ్మింద గ్రామంలో క్రైస్తవులు తమిళనాడులోని వేలాంకన్ని మేరీ మాతను దర్శించుకునేందుకు జీజేఎం ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి ఆయన బస్సులను ప్రారంభించారు. యాత్రకు వెళ్తున్న క్రైస్తవులు జీజేఎం ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు మోహన్ రాజ్, మేషాక్, శశికర్‌బాబు, రఘు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను ఆదుకుంటాం: జీజేఎం



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, మార్చి 13: అన్ని వర్గాల నిరుపేదలను ఆదుకోవడమే జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ లక్ష్యమని నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని ముస్లింలకు రంజాన్ తోఫాను మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు చేతులమీదుగా పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు సాంబశివ నాయుడు, ఆదాం బాషా, రవి నాయుడు, నవీన్, శేఖర్, గోపి, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, శంకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

కార్వేటినగరం, మార్చి 13: కార్వేటినగరంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లత, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే టీడీపీ విజయం

● గురజాల జగన్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 13: అందరి సహకారంతోనే టీడీపీ విజయం సాధ్యమని చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ చెప్పారు. బుధవారం సంతపేటలోని ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో నగరంలోని 45,46,47,48,49 డివిజన్లకు సంబంధించిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కార్యకర్తలు, నాయకులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు చాలా కీలకమైనవని తెలిపారు. అధికార పార్టీనుంచి అనేక సవాళ్లు ఎదురవుతాయని, అయినా మనం దేనికీ బెదరకుండా ధీటుగా ఎదుర్కోవాలని చెప్పారు. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో అనేక సమస్యలున్నాయని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డుల్లోని ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలని కోరారు. అన్ని వర్గాలవారూ తనకు సహకరించి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు చంద్రప్రకాష్, కటారి హేమలత, దగ్గుమళ్ల ప్రసాదరావు, కాజూరు బాలాజి, సీఆర్ రాజన్, కోదండయాదవ్, గురజాల సందీప్, సుబ్బా నాయుడు, వరుణ్ కుమార్, గోళ్ల హేమాద్రి నాయుడు, సీఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

వెంగమనాయుడు కుంటను కాపాడండి

● శ్మశాన వాటిక చేయొద్దంటూ కటికపల్లె రైతుల నిరసన



కుంట వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

శ్రీరంగరాజపురం, మార్చి 13: మండలంలోనే కటికపల్లెలోని సర్వేనెంబరు 119/7లో ఉన్న వెంగమనాయుడు కుంటను కాపాడాలని కుంట చుట్టుపక్కల పొలాలు ఉన్న కటికపల్లెకు చెందిన రైతులు బుధవారం ఆ కుంట వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వెంగమనాయుడు కుంటలో చేరే వర్షపు నీటితో తమ పొలాలను సాగుచేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆవులు, మేకలకు కూడా తాగునీటిగా ఉపయోగపడుతుందని చెప్పారు. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ బోడిదేవరపల్లి గ్రామస్తులు శ్మశానం కావాలని రెవెన్యూ అధికారులను కోరగా, వారు గత రెండు రోజులుగా వెంగమనాయుడు కుంటను పరిశీలించి, దానిలో శ్మశాన స్థలం ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేసి, భయాందోళనకు గురిచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ శ్మశానికి స్థలం కేటాయిస్తే, కుంటలో శవాలను వేయడంతో నీరు కాలుష్యమయ్యే ప్రమాదం ఉందని, రెవెన్యూ అధికారులు స్పందించి ఆ కుంటను అలాగే ఉంచాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు లక్కపూడి బాబు నాయుడు, చిన్నస్వామి నాయుడు, చంద్రయ్య, రాజేంద్రయ్య, భాగ్యలక్ష్మి, ఆనందమ్మ, రాఘవేంద్ర, చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మొల్ల' రచనాశైలి రమణీయం



మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 13: కవయిత్రి మొల్ల రచనాశైలి సరళమైనది, రమణీయమైనదని డీఆర్వో పుల్లయ్య అన్నారు. మొల్ల జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఆమె చిత్రపటానికి డీఆర్వో పూలమాల వేసి నివాళులర్పించారు. రామాయణాన్ని కవయిత్రి మొల్ల అతి సులువైన పదాలతో తెలుగులో రాశారని డీఆర్వో అన్నారు. ఆమె రాసిన రామాయణం 'మొల్ల రామాయణం'గా ఎంతో ప్రసిద్ధి చెందిందని చెప్పారు. ప్రభుత్వం మొల్ల జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రబ్బాని బాషా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నిర్వహణ అదృష్టంగా భావించాలి: జేసీ



శిక్షణా తరగతుల్లో సూచనలు ఇస్తున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 13: త్వరలో జరిగే ఎన్నికల్లో విధులు నిర్వహించడం అదృష్టంగా భావించాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో నాలుగు రోజుల పాటు జరిగే పీవో, ఏపీవోల శిక్షణా తరగతులను జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని వ్యవహారాలు నియంత్రించే చట్టపరమైన అధికారం పీవోలకు ఉందని చెప్పారు. పోలింగ్ సమయంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి రాజ్యలక్ష్మి, బీసీ వెల్ఫేర్ అధికారి రబ్బాని బాషా, ఏపీడీలు గంగాభవాని, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరికి మాస్టర్ ట్రైనీలచే పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి: డీఆర్వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 13: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్వో పుల్లయ్య కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికలు జరిగేటట్లు చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పన దాదాపు పూర్తయిందని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన రోజు నుంచే అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం నిమిత్తం ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన బ్యానర్లు, కటౌట్లను స్వచ్ఛందంగా తొలగించి సహకరించాలని కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు జగదీశ్వర్ నాయుడు, ఆట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), గంగరాజు (సీపీఎం), సురేంద్రకుమార్ (టీడీపీ), భాస్కర్ (బీఎస్పీ), పరదేశి (కాంగ్రెస్), ఉదయ్‌కుమార్ (వైసీపీ), ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు, సిబ్బందిని బదిలీ చేయండి: బీజేపీ

చిత్తూరు (సెంట్రల్): ఎన్నికల్లో ఓటర్లను ఎక్కువగా ప్రభావితం చేసే గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఉద్యోగులు, సిబ్బందిని బదిలీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ నాయుడు, శ్రీనివాసులు డీఆర్వో పుల్లయ్యకు విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది, వలంటీర్లను అధికార పార్టీ కార్యకర్తలుగా ఉపయోగించుకుని, క్షేత్ర స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేస్తోందన్నారు. ఎన్నికల సంఘం గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఉద్యోగులు, సిబ్బంది, వలంటీర్లను గుర్తించి బదిలీ చేయాలని వారు కోరారు.

స్కానింగ్ కేంద్రాల్లో డీఎంహెచ్‌వో తనిఖీ



నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో


చిత్తూరు రూరల్, మార్చి 13: నగరంలోని పలు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలను డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి ఆకస్మిక బుధవారం తనిఖీ నిర్వహించారు. అక్కడున్న రికార్డులను ఆమె పరిశీలించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ పట్టుబడితే గర్భిణీకి, వెంట వచ్చిన వారికి, నర్స్ డాక్టర్లకు మూడేళ్ల జైలు శిక్ష పడుతుందని ఆమె హెచ్చరించారు.

రిజిస్ట్రేషన్ లేని వైద్యశాలలు, ల్యాబ్‌లను సీజ్ చేస్తాం

నగరి, మార్చి 13: రిజిస్ట్రేషన్ లేని వైద్యశాలలు, ల్యాబ్‌లను సీజ్ చేస్తామని జిల్లా రిజిస్ట్రేషన్, నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి వైద్యశాల, ల్యాబ్‌లు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నగరి పట్టణ పరిధిలోని ప్రైవేటు వైద్యశాలలను, ల్యాబ్‌లను, స్కాన్ సెంటర్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తనిఖీలు చేసిన 90 శాతం వైద్యశాలలు రిజిస్ట్రేషన్‌లు చేసుకోలేదని గమనించినట్లు తెలిపారు. ప్రతి వైద్యశాల, స్కానింగ్‌సెంటర్, ల్యాబ్‌లు, రిజిస్ట్రేషన్ చేసుకుని ధ్రువీకరణ పత్రాలను పొందాలన్నారు. తనిఖీలో నకిలీ వైద్యులను కనుగొంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్‌లో లింగనిర్ధారణ చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

జిల్లా మొదలియార్ సాధికార సంఘం

ప్రధాన కార్యదర్శిగా నాగరాజ్



నాగరాజ్‌కు నియామక పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, గురజాల తదితరులు

చిత్తూరు సిటీ, మార్చి 13: టీడీపీ రాష్ట్ర మొదలియార్ సాధికారసంఘ అధ్యక్షుడు త్యాగరాజన్ ఆదేశాల మేరకు స్థానిక మురకంబట్టుకు చెందిన నాగరాజన్‌ను ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మురకంబట్టు టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్, టీడీపీ నేతలు కాజూరు బాలాజి, కఠారి హేమలత, త్యాగరాజన్‌లు నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు.

పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థుల తోడ్పాటు



టెన్త్ విద్యార్థినికి ప్యాడ్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గంగాధరనెల్లూరు, మార్చి 13: పదవ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థులు తమవంతు తోడ్పాటు అందించడం భేష్ అని హెచ్‌ఎం హేమలత, అసిస్టెంట్ హెచ్‌ఎం దినకర్ అభినందించారు. 1982-83లో పదవ తరగతి చదివిన విద్యార్థులు తాము చదువుకున్న స్కూల్లో ఈఏడాది టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న 62మంది విద్యార్థులకు ప్యాడ్లు, జామెంట్రిబాక్స్‌లను హెచ్‌ఎం, టీచర్లతో కలిసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ 41ఏళ్ల తర్వాత కలుసుకున్న తాము చదువుకున్న హైస్కూల్ పురోభివృద్ధితో పాటు పేదవిద్యార్థులకు సహకారాన్ని అందించాలని ముందుకొచ్చామన్నారు. పూర్వవిద్యార్థులు ప్రభాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, మధుసూదన్, నిత్యానందం నాయుడు, రవీంద్ర నాయుడు, జయచంద్ర నాయుడు, వరదారెడ్డి, ప్రభాకర్ నాయుడు, జానకిరామాచ్చారి, జగన్‌బాబు పాల్గొన్నారు.

నగరి అభ్యర్థి గెలుపునకు కృషి



భానుప్రకాష్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న వెదురుకుప్పం టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, మార్చి 13: నగరి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని వెదురుకుప్పానికి చెందిన ప్రవాసాంధ్ర నాయకులు గాలి శ్రీనివాసులు నాయుడు బుధవారం తెలిపారు. బెంగళూరులో మంగళవారం రాత్రి జరిగిన ప్రవాసాంధ్రుల ఆత్మీయ సమావేశంలో భానుప్రకాష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించామని తెలిపారు. ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.గోపినాథ్, శ్రీకాంత్, రాము, మహేశ్, జనార్థన్ నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడం తథ్యం

వెదురుకుప్పం, మార్చి 13: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో రాష్ట్రంలో 130 నుంచి 140 మంది ఉమ్మడి అభ్యర్థుల గెలుపు ఖాయమన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ప్రతి ఓటరు తమ రెండు ఓట్లను సైకిల్ గుర్తుకే వేయాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు.

నూతన భవన సముదాయాల ప్రారంభం

కార్వేటినగరం, మార్చి 13: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూసా 2.0 పథకం కింద నిర్మించిన నూతన భవన సముదాయాలను బుధవారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ కళాశాలల కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ హాజరుకాగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి, ఎంపీపీ లత, సీడీసీ మెంబర్ బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి



అచ్చెన్నాయుడిని కలసి దరఖాస్తు అందిస్తున్న దశరథవాసు

సత్యవేడు, మార్చి 13: సత్యవేడు టీడీపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ టీడీపీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు దశరథవాసు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని కలసి వినతిపత్రం అందించారు. ఈ మేరకు మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, రాయలసీమ జోన్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిలను కలిసి తన అభ్యర్థిత్వ పత్రాన్ని అందించారు. 2014, 2019 ఎన్నికల్లోనూ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకుని ప్రయత్నించానని, పార్టీ నిర్ణయం మేరకు బీ ఫాం ఇచ్చిన వారి గెలుపు కోసం కృషి చేశానన్నారు. నింద్ర మండల పార్టీ అధ్యక్షుడిగా మూడు సార్లు సేవలందించానని గుర్తు చేశారు. సత్యవేడు నియోజకవర్గంలో తమ సామాజిక వర్గానికి చెందిన తమిళ ఓటర్లు అధికసంఖ్యలో ఉండటంతో పాటు ఏడు మండలాల్లోనూ బంధు, మిత్రులు, అనుచరులున్నారని తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి



శోభారాణి (ఫైల్‌ఫొటో)

పాలసముద్రం, మార్చి 13: మండలంలోని బాలక్రిష్ణాపురం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ శోభారాణి బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె గత నెలరోజులుగా అనారోగ్య కారణాల వల్ల తిరుపతిలోని అమర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. ఆమె భర్త కోదండ నాయుడు ప్రముఖ టీడీపీ నాయకుడు. ఆమె మృతిపట్ల అంగన్‌వాడీ సిబ్బంది, టీడీపీ నాయకులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.